www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 27 ఆగస్టు 2025

5

కాకినాడ

కమిషనర్‌గా సూర్యప్రకాష్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ (ఎఫ్‌ఎసి)గా సూర్యప్రకాష్‌రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సూర్యప్రకాష్ ప్రస్తుతం నగర పంచాయతీ ఇఒగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత కమిషనర్ సత్యనారాయణరావు ఎసిబికి చిక్కడంతో ఆయన స్థానంలో సూర్యప్రకాష్‌ను నియమించారు. కమిషనర్‌గా మంగళవారం ఉద్యోగ బాధ్యలు స్వీకరించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాల సీజన్లో పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెడతామన్నారు. ఆయన నియామకం పలువురు ప్రజా ప్రతినిధులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

వీడని యూరియా కష్టాలు..!

- -ఆందోళనలో అన్నదాతలు
- -పురుగుల మందులు కొనాల్సిందే
- -ప్రైవేటు డీలర్ల ఇష్టారాజ్యం

గొల్లప్రోలులో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు సొసైటీ వద్ద రెండు రోజుల క్రితం రైతులు నిరసనకు దిగారు. సరిపడా యూరియా ప్రభుత్వం సరఫరా చేయడం లేదంటూ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. వందలాదిమంది అక్కడకు చేరుకుని ప్రభుత్వ తీరు పట్ల తీవ్రస్థాయిలో మండిపడ్డారు. యూరియా కోసం ఎన్నడూ లేనివిధంగా కష్టాలు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అయినా సరే అధికారులు రైతులకు సరిపడా యూరియాను అందుబాటులోకి తీసుకురాలేకపోయారు. పాలక పార్టీ పెద్దలు యూరియా కొరతపై కనీసంగానైనా స్పందించడం లేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి జిల్లాలో పలు ప్రాంతాల్లో కనిపిస్తోంది. యూరియా కోసం ఆర్‌ఎస్‌కెలు, సొసైటీలు, ప్రైవేటు డీలర్ల వద్దకు కాళ్లరిగేలా రైతన్నలు తిరుగుతున్నారు.

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్లో సుమారు 23 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే ఇప్పటివరకు సుమారు 18 వేల మెట్రిక్ టన్నులు సరఫరా అయిందని అధికారులు చెబుతున్న గణాంకాలు. ఎకరాకు 60 రోజులు వ్యవధిలో కేవలం ఒక బస్తా యూరియా వాడితే సరిపోతుందని వ్యవసాయ శాఖ అధికారుల వాదన. కానీ వాస్తవానికి రైతులకు సరిపడా యూరియా రాకపోవడంతో సొసైటీలు, ప్రైవేటు డీలర్ల వద్ద రైతులు క్యూ కడుతున్నారు. గత ఏడాది ఇదే సీజన్లో ఆగస్టు వరకు రైతులు సుమారు 16 వేల టన్నుల యూరియాను వినియోగించగా ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు 15 వేల మెట్రిక్ టన్నుల వినియోగం జరిగిందని అధికారులు చెబుతున్నారు. మిగిలిన యూరియాను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. కానీ కొరత ఎందుకు ఏర్పడుతుందనేది వేధిస్తున్న ప్రశ్న.

ఆది నుంచి కష్టాలే...

రైతులను ఆది నుంచి ఖరీఫ్ సాగు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. నిన్న, మొన్నటి వరకు సాగునీటి లభ్యత లేక ఖరీఫ్ ఆలస్యం కాగా ఎట్టకేలకు వరి నాట్లు పనులు పూర్తి కాగా ప్రస్తుతం యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. రైతులకు అవసరమయ్యే ఎరువులు లభ్యత పూర్తి స్థాయిలో లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదనేది క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తుంటే అర్థమవుతుంది. ముఖ్యంగా యూరియా కొరత వేధిస్తోందనేది అన్నదాతల ఆరోపణ. తగిన ఏర్పాట్లు చేసి అవసరమయ్యే యూరియాను అందుబాటులో ఉంచాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న ప్రైవేటు డీలర్లు పలు చోట్ల కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. మరోవైపు అధికార పార్టీ నేతలు తమకు నచ్చిన వారికి యూరియాను కట్టబెడుతుండడంతో యూరియా పూర్తిస్థాయిలో రైతులకు చేరడం లేదు. ఈ నేపథ్యంలో పంటల దిగుబడిపై ప్రభావం పడుతుందని కర్షకులు ఆందోళన చెందుతున్నారు.

పడిగాపులు

యూరియా కొరత లేదని అధికారులు ఒక పక్క చెబుతున్నప్పటికీ వాస్తవానికి రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. సొసైటీలు, ప్రైవేటు డీలర్ల వద్ద క్యూ కడుతున్నారు. గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. అయినా సరే యూరియా కావలసినంత అందుబాటులో లేకపోవడం గమనార్హం. కొన్నిచోట్ల నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం పంట ఆశించిన స్థాయిలో ఎదుగుదల ఉండాలంటే యూరియా తప్పనిసరిగా వేయాల్సి ఉంటుంది. దీంతో ఎలాగైనా తమ పంటలకు యూరియాను వేయాలనే ఆశతో రైతులు కాళ్లు అరిగేలా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కొన్నిచోట్ల అధికార పార్టీ నేతల సిఫార్సులు పొందిన వారికి మాత్రం యూరియా సక్రమంగానే అందుతున్న పరిస్థితి ఏర్పడింది. మిగిలిన రైతులకు గంటల తరబడి వేచి ఉంటున్నా ప్రైవేటు డీలర్లు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. యూరియా కావాలంటే గుళికలు, ఇతర పురుగు మందులు కొనుగోలు చేయాలనే లింకు పెడుతున్నారు. ప్రస్తుతం తమకు పురుగుల మందులు అవసరం లేదని యూరియా మాత్రం ఇవ్వాలని వేడుకుంటున్నా డీలర్లు పట్టించుకోవడం లేదు. అధికారులకు ఫిర్యాదులు అందుతున్నప్పటికీ డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తమపై అదనపు భారం పడుతుందని, ఇప్పటికే అప్పులు చేసి పెట్టుబడులు పెడుతుంటే అవసరం లేని మందులు ఎలా కొనుగోలు చేస్తామంటూ పలువురు రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

సరిపడా యూరియా లేదు

గత రెండు రోజులుగా యూరియా కోసం తిరుగుతున్నాను. గొల్లప్రోలు, పిఠాపురంలలో ప్రైవేటు డీలర్ల వద్ద అడుగుతున్నప్పటికీ అదిగో ఇదిగో అంటున్నారు. చివరకు పురుగుల మందులు కొంటేనే యూరియా ఇస్తామని బదులిస్తున్నారు. చివరకు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎట్టకేలకు యూరియా అందజేశారు.

-బావిశెట్టి వెంకటరమణ, రైతు, చేబ్రోలు

ఎన్నడూ ఇన్ని కష్టాలు లేవు

నేను 4 ఎకరాలు సాగు చేస్తున్నాను. గత 3 రోజులుగా 6 బస్తాల యూరియా కోసం దుకాణాల వద్దకు తిరుగుతున్నా అందుబాటులో లేదు. చివరకు ఓ ప్రైవేట్ డీలర్ వద్ద కొనుగోలు చేద్దామని వెళితే గుళికలు కొనాల్సిందేనని లింక్ పెట్టారు. ఇన్ని కష్టాలు ఏ రోజూ పడలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయిలో యూరియాను అందుబాటులో ఉంచాలి.

-ఎం.ప్రసాద్, రైతు, బి.ప్రత్తిపాడు,

అర్బన్ తహసిల్దార్ జితేంద్రకు వినతిపత్రం అందనజేస్తున్న యూనియన్ నాయకులు

టాటా మ్యాజిక్ డ్రైవర్లను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

టాటా మ్యాజిక్ వాహన డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని టాటా మ్యాజిక్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్స్ నాయకులు కోరారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో అర్బన్ తహశీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు, యూనియన్ అధ్యక్షుడు వాలిశెట్టి శ్రీను మాట్లాడుతూ టాటా మ్యాజిక్ వాహనాలకు మహిళా ప్రయాణీకులే ఆధారమన్నారు. వాహనం తిరిగినా, తిరగకపోయినా ఏడుగురు ప్యాసింజర్లు గల వాహనానికి క్వార్టర్లీ రూ.5500, 9 మంది ప్యాసింజర్లు ప్రయాణించే వాహనానికి క్వార్టర్లీ రూ.7200 పన్ను చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఇన్సూరెన్స్, టోల్‌ట్యాక్స్ తప్పదన్నారు. మరో ప్రక్క వాహనం మరమ్మతులు, ఫైనాన్స్ చెల్లింపులు ఉంటాయన్నారు. స్త్రీ శక్తి పథకంతో ప్రస్తుతం టాటా మ్యాజిక్ డ్రైవర్స్ పూర్తిగా రోడ్డున పడ్డారని అన్నారు. కావున డీజిల్ వేయించి రోజుకి రూ.1250 చెల్లించి మహిళల ఉచిత ప్రయాణంలో టాటా మ్యాజిక్ వాహనాలను భాగస్వాములు చేయాలని కోరారు. ఒరిస్సా రాష్ట్రంలో వలే టాటా మ్యాజిక్ వాహనాలకు లైఫ్ ట్యాక్స్ ఉండాలన్నారు. టాటా మ్యాజిక్‌లతో పాటు ఇతర ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ అందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కాకినాడలో ఉన్న ప్రైవేట్ ఫిట్‌నెస్ సెంటర్‌ను రద్దు చేసి ప్రభుత్వమే నిర్వహించాలని, పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన యూనియన్ నాయకులు రెడ్డి వీరబాబు, పి.సూర్యచక్రం, చిన్న, రామకృష్ణ, జి.రాజేష్, ఎం.కృష్ణ, నాగదుర్గ, వాసంశెట్టి శ్రీనివాస్, పి. మణి, బి. సత్యనారాయణ మూర్తి, వి.హేమ కుమార్, సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అండగా కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - కాకినాడ

మీడియాతో మాట్లాడుతున్న జ్యోతుల నవీన్‌కుమార్

మెగా డిఎస్‌సితో కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా నిలిచిందని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ ప్రకారం 16,347 ఉపాధ్యాయ పోస్టులను మెగా డిఎస్‌సి ద్వారా భర్తీ చేసినట్లు తెలిపారు. టిడిపి పాలనలో ప్రతిసారీ టీచర్ పోస్టుల భర్తీని క్రమం తప్పకుండా చేస్తున్నట్లు చెప్పారు. డిఎస్‌సి నిర్వహించకుండా వైసిపి ప్రభుత్వం కోర్టుల్లో 24 కేసులు వేయించినా, వాటిని అధిగమించి డిఎస్‌సిని నిర్వహించిన ఘనత మంత్రి లోకేష్‌కు దక్కుతుందన్నారు. ప్రభుత్వం ఎల్లవేళలా నిరుద్యోగులకు అండగా ఉంటుందని అన్నారు. చంద్రబాబు సిఎంగా ఉండి ఇప్పటివరకు 13 డిఎస్‌సిలు నిర్వహించి 1,80,208 పోస్టులను భర్తీ చేసి చరిత్ర సృష్టించారన్నారు. టీచర్లపై పని ఒత్తిడి తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు.

సిపిఎం నేత రాజగోపాల్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - కాకినాడ

నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం పూర్వ నాయకులు ఎం.రాజగోపాల్‌కు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్లో రాజగోపాల్ 5వ వర్ధంతి కార్యక్రమం కార్యాలయ కార్యదర్శి కె.వీరబాబు అధ్యక్షతన జరిగింది. తొలుత రాజగోపాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జీవిత బీమా సంస్థలో ఉద్యోగం చేస్తున్న కాలంలో ఆ సంఘం నాయకుడిగా కృషి చేశారని గుర్తు చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం సకల శ్రామిక వర్గం ప్రయోజనాల కోసం పనిచేసిన ధన్యజీవని కొనియాడారు. వ్యక్తిగత జీవితంలో ఎన్ని ఆటు పోట్లు ఎదురైనా పార్టీ నిర్వహించిన కార్య కలాపాల్లో చురుగ్గా పాల్గొనడం, కోవిడ్ సమయంలో పార్టీ శ్రేణులను ఆదుకోవడం, యువ కార్యకర్తలను ఉద్యమాల వైపు ప్రోత్సహించారని అన్నారు. రాజగోపాల్ అనుసరించిన మార్గాన్ని దీక్షతో కొనసాగిస్తూ సమ సమాజ స్థాపనకు పని చేయడమే రాజగోపాల్‌కు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాజశేఖర్, కెఎస్.శ్రీనివాస్, రూరల్ కమిటీ కార్యదర్శి తిరుమలశెట్టి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు పెద్దింశెట్టి రామకృష్ణ, సిహెచ్.అజయ్ కుమార్, సుబ్రహ్మణ్యం, సిఐటియు నాయకులు టి. రాజా, వి.చంద్రరావు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఎం.గంగసూరిబాబు, మత్స్య కార్మిక సంఘం నాయకులు సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

క్యాన్సర్ బ్లాక్ నిర్మాణం త్వరలోనే ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కలెక్టర్

క్యాన్సర్ వ్యాధికి అత్యాధునిక వైద్యాన్ని అందించేందుకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో క్యాన్సర్ బ్లాక్ నిర్మాణం త్వరలోనే ప్రారంభం అవుతుందని కలెక్టర్, రెడ్ క్రాస్ సంస్థ అధ్యక్షులు షాన్‌మోహన్ సగిలి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో రెడ్ క్రాస్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాకినాడ రెడ్ క్రాస్ సేవలలోను, నిర్వహణలోనూ రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచిందని అన్నారు. సంస్థ ఛైర్మన్ వైడి.రామారావు నాయకత్వంలో రాష్ట్ర శాఖ దేశంలో అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం 2025-28 సంవత్సరానికి నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఛైర్మన్‌గా వైడి.రామారావు, వైస్ ఛైర్మన్‌గా ఎన్.సుగుణ, కోశాధికారిగా ఎన్‌వివిఆర్‌కె. ప్రసాద్‌బాబు, కార్యవర్గ సభ్యులుగా జి.శివరామకృష్ణ, బాదం బాలకృష్ణ, ఎస్‌విఎం.చంద్రశేఖర్, పైడా భావనప్రసాద్, ఆకెళ్ళ శాస్త్రి, ఎన్.భానుమతి, ముంజులూరు విశ్వేశ్వరరావు, సిహెచ్.విజయ ప్రకాష్ ఎన్నికయ్యారు. అనంతరం కలెక్టర్ వారితో ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్ర కోశాధికారి పి.రామచంద్రరాజు పరిశీలకునిగా హాజరయ్యారు. అనంతరం రెడ్ క్రాస్ సంస్థకు సేవలందించిన, విరాళాలు అందించి సహకరించిన దాతలకు, అధికారులకు బంగారు పతకాలను కలెక్టర్ ప్రదానం చేశారు. డిఆర్‌ఒ జె.వెంకట్రావు, జడ్‌పి సిఇఒ వి.లక్ష్మణరావు, సిపిఒ పి.త్రినాథ్, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, తదితరులు బంగారు పతకాలను అందుకున్నారు. అత్యధిక రక్తదానం చేసిన ప్రభుత్వ శాఖల్లో వ్యవసాయ శాఖ జెడి విజయకుమార్, పిఠాపురం ఎంపిడిఒ, ప్రత్తిపాడు తహశీల్దార్, తదితరులకు జ్ఞాపికలు అందచేశారు.

383 మంది వికలాంగులకు నోటీసులు

ప్రజాశక్తి - పెద్దాపురం

వికలాంగ పింఛన్ల పరిశీలనలో భాగంగా మండల పరిధిలో 383 మందికి నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపిడిఒ డి.శ్రీలలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటీసులు అందుకున్న వారు తిరిగి దరఖాస్తు చేసుకుంటే రీ వెరిఫికేషన్ చేయించి అర్హులైన వారికి పింఛన్లు పునరుద్ధరిస్తామన్నారు. మున్సిపల్ పరిధిలో 692 మంది వికలాంగ పింఛన్‌దారులు ఉండగా, వారిలో 108 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. వీరిలో 8 మందిని ఇతర పింఛనులకు అర్హులుగా గుర్తించామన్నారు. మండల పరిధిలో 1,666 మంది వికలాంగ పింఛన్‌దారులు ఉండగా వీరిలో 283 మందికి నోటీసులు జారీ చేశామని ఎంపిడిఒ శ్రీలలిత తెలిపారు.

28న గొల్లప్రోలు కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఈ నెల 28వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎన్.కనకారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ ఛైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, వీధిలైట్లు వంటి అంశాలపై చర్చ ఉంటుందని తెలిపారు. కావున ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ప్రవేశాలకు గడువు పెంపు

ప్రజాశక్తి - రౌతులపూడి

2025-26 విద్యా సంవత్సరంలో చదువును మధ్యలో నిలిపివేసిన వారు 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు ఎపి ఓపెన్ స్కూల్ సొసైటీ గడువును పెంచినట్లు ఎంఇఒలు సతీష్‌బాబు, కొండబాబు తెలిపారు. 14 సంవత్సరాల దాటిన వారు పదవ తరగతి 16 ఏళ్లు దాటిన వారు ఇంటర్మీడియట్ ప్రవేశానికి అర్హులన్నారు. రూ.100ల ఆలస్య రుసుంతో సెప్టెంబర్ 15లోగా ప్రవేశం పొందాలన్నారు. వివరాలకు తమకు దగ్గరలో ఉన్న స్టడీ సెంటర్లో సంప్రదించాలని తెలిపారు.

కూటమి పాలనలో రైతన్నలకు కష్టాలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

కూటమి పాలనలో రైతన్నలకు కష్టాలు తప్పడం లేదని వైసిపి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మంగళవారం స్థానిక జడ్‌పిటిసి బెహరా దొరబాబు నివాసంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కోసం రైతన్నలు అష్ట కష్టాలు పడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. వైసిపి పాలనలో ఏనాడు రైతులు విత్తనాలు,ఎరువులు కోసం రోడ్ ఎక్కిన పరిస్థితి లేదన్నారు. రైతులకు తక్షణమే ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోళ్ళ కాంతిసుధాకర్, నాయకులు రామిశెట్టి నాని, ఎం.నూకరాజు, రెడ్డి నాయుడు, ఎస్.భాస్కరరావు, పినిశెట్టి ప్రకాష్ పాల్గొన్నారు.

వసతుల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి - సామర్లకోట

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప

మున్సిపాలిటీలలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మంగళవారం పట్టణంలో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. తొలుత 15వ ఆర్థిక సంఘం, బిపిఎస్ నిధులు సుమారు రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం మఠం సెంటర్ నుంచి నిమ్మతోట వరకు నిర్మించిన సిమ్మెంట్ రోడ్డును, పిహెచ్‌సి వద్ద నిర్మించిన సిమ్మెంట్ రోడ్డు, లారీ స్టాండ్ వద్ద నిర్మించిన సిమ్మెంట్ రోడ్డును, గాంధీ నగర్ ప్రాంతంలో నిర్మించిన సిమ్మెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, కౌన్సిలర్లు బలుసు శ్రీనివాస్, జయలక్ష్మి, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, రైతు సంఘం అధ్యక్షులు కంటే జగదీశ్ మోహన్, మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ గోలి వెంకట అప్పారావు చౌదరి, నాయకులు పాల్గొన్నారు.

రైతుల భూముల జోలికి రావద్దు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని కొమరగిరి గ్రామంలో భూములను సాగు చేసుకుంటున్న రైతుల జోలికి రావద్దని రైతు సంఘం నాయకులు జి అప్పారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం రైతులకు మద్దతుగా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. కొమరగిరి గ్రామంలోని సర్వే నెంబర్ 121, 122 లోని 20 ఎకరాల భూమిని 40 మంది రైతులు 90 ఏళ్ల క్రితం కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్నారని అన్నారు. అవి దేవస్థానం భూములంటూ వేరే గ్రామస్తులు ఆ భూముల్లోకి వెళ్లి ప్రస్తుతం సాగు చేసుకుంటున్న పేద రైతులను జనసేన పార్టీ అండతో అడ్డుకుంటున్నారని విమర్శంచారు. ఏ విధమైన ఆధారాలు లేకపోయినా పేద రైతులను వెళ్ళగొట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. డిప్యూటీ సిఎం, నియోజకవర్గ ఎంఎల్‌ఎ పవన్ కల్యాణ్ వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టి.నాగేశ్వరరావు, వి.చంద్రరావు పాల్గొన్నారు.

ఆందోళనతో రైతు మృతి

కొమరగిరి గ్రామానికి చెందిన కండి పిల్లి చంద్రరావు అనే రైతు భూమి కోల్పోతామని ఆందోళనతో మంగళవారం మృతి చెందినట్లు రైతులు గుల్లపల్లి కృష్ణ, రాజశేఖర్ తెలిపారు. కొమరగిరి గ్రామంలో పంట పండించుకుంటున్న చంద్రరావుకు రెవెన్యూ అధికారులు దేవాలయ భూమిపై ఎటువంటి హక్కు లేదని నోటీసులు జారీ చేయడంతో అప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్న రైతు చంద్రరావు ఆందోళనతో మృతి చెందినట్లు తెలిపారు.

కార్టూ'నిజం'



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి - కాకినాడ

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సిఐ రమేష్

స్థానిక సినిమా రోడ్‌లో వాహనదారులకు, పాదాచారులకు హెల్మెట్ వాడకం, ట్రాఫిక్ రూల్స్, సైబర్ నేరాలపై కాకినాడ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్-1 సిఐ రమేష్ మాట్లాడుతూ మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మోటార్ వాహనాలు కలిగిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం జారీ చేసిన నంబర్ ప్లేట్లను మాత్రమే వాడాలన్నారు. ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయరాదన్నారు. రాష్ అండ్ నెగ్లిజెన్స్‌గా డ్రైవ్ చేయరాదని, మాడిఫైడ్ సైలెన్సర్లు వాడరాదన్నారు. సెల్‌ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. ఎంవి యాక్ట్ కొత్త చట్టం ప్రకారం తప్పు చేసిన వాహనదారులకు భారీ జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్‌లోన్స్, ఆన్‌లైన్ జాబ్స్, వర్క్స్, డిజిటల్ అరెస్టు, 112, 100, 1930, 1972 కాల్స్ యొక్క ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ సిహెచ్.కిషోర్‌కుమార్, 3 టౌన్ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డును అందుకుంటున్న ఎంపిడిఒ హిమామహేశ్వరి

ఎంపిడిఒకు రెడ్ క్రాస్ సిల్వర్ మెడల్

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక ఎంపిడిఒ కాదా హిమామహేశ్వరి మంగళవారం రెడ్ క్రాస్ సిల్వర్ మెడల్‌ను అందుకున్నారు. కలెక్టరేట్‌లో జరిగిన రెడ్ క్రాస్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఈ అవార్డును కలెక్టర్ చేతుల మీదుగా ఆమె అందుకున్నారు. రెడ్ క్రాస్ పురస్కారం అందుకున్న ఎంపిడిఒకు ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, డిప్యూటీ ఎంపిడిఒ మల్లాడి బైరవమూర్తి, మండల పరిషత్ కార్యాలయ ఎఒ బి.సతీష్, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయల సిబ్బంది అభినందనలు తెలిపారు.

దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 23 గ్రామాల్లో ఇళ్ల స్థలాల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనను త్వరిగతిన పూర్తి చేయాలని తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో విఆర్‌ఒలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి స్థలం కోసం ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి రికార్డులు తయారు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో కుల ధ్రువీకరణ పత్రాలు వేగంగా అందజేయాలన్నారు. అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల గుర్తింపును పూర్తి చేయాలన్నారు.

ఘనంగా మదర్ థెరిసా జయంతి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

అడబాల ట్రస్ట్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ విశ్రాంతి జనరల్ మేనేజర్ ప్రసాద్‌నాయుడు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రాజా, సత్యనారాయణ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో చేపట్టిన పారిశుధ్య పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. బస్టాండ్ పరిసరాలు, మెయిన్ రోడ్, వినాయక చవితి సామగ్రి అమ్మక ప్రాంతాలల్లో పర్యటించారు. పట్టణ పరిధిలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే పందిళ్ల వద్ద పారిశుధ్య పరిస్థితిని సమీక్షించి పలు సూచనలు చేశారు.

నేరాలు ఘోరాలు

నీలపల్లిలో దారుణ హత్య

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని నీలపల్లి చెక్ పోస్ట్ ప్రాంతంలోని మురళీ నగర్‌లో సోమవారం అర్ధరాత్రి దారుణ హత్య జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి కోరంగి ఎస్‌ఐ పి.సత్యనారాయణ మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు యానంలోని కాకివారి వీధికి చెందిన పాలెపు శ్రీనివాస్(45) అంకాని రాజు స్నేహితులు. వీరిద్దరి మధ్య సెల్ ఫోన్ కోసం తగాదా వచ్చింది. దీంతో శ్రీనివాస్ తలపై రాజు రాయితో కొట్టి హత్య చేసి పరారైనట్లు తెలిపారు. గస్తీ తిరుగుతున్న యానాం పోలీసులు మృతదేహాన్ని గుర్తించారు. యానాం ఎస్‌ఐ పునీత్‌రాజ్, ట్రాఫిక్ ఎస్‌ఐ నూకరాజు, క్రైమ్ టీం, కోరంగి ఎస్‌ఐ సత్యనారాయణ అర్ధరాత్రి 12 గంటల సమయంలో సంఘటనా ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని ప్రొక్లైనర్ డ్రైవర్ శ్రీనుగా గుర్తించారు. మతుడికి భార్య వెంకటలక్ష్మి, కుమారుడు ఉన్నారు. మృతుడు భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

భర్తపై పెట్రోల్ పోసి నిప్పటించిన భార్య

ప్రజాశక్తి - రావులపాలెం

భర్తపై పెట్రోలు పోసి అంటించిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సిఐ శేఖర్ బాబు తెలిపారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలపరిధి గోపాలపురం గ్రామానికి చెందిన మట్టా ఏంజెలీనా జెన్నిఫర్ థామస్ తన భర్త మట్టా శ్రీనివాస్ ప్రతీరోజూ తాగి వేధిస్తున్నాడు. వేధింపులు తాళలేక సోమవారం రాత్రి నిద్రపోతున్న భర్తపై అప్పటికే తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసి నిప్పు పెట్టడింది. దీంతో అతనికి తీవ్ర గాయాలు కాగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందున్నాడు. ఈ సంఘటనపై ఎస్‌ఐ కెవి.రమణరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఒక వివాహిత అదృశ్యమైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన ఝాన్సీ అనే వివాహిత ఈనెల 24న ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అయితే ఆ రోజు ఆమె సాయంత్రం అయినప్పటికీ తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గ్రామాలు పరిసర ప్రాంతాలు, బంధువుల ఇంటి వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆమె బంధువులు మంగళవారం స్థానిక స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదుకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎస్.రాము తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని మంగళవారం లారీ ఢీ కొనడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నగర పంచాయతీ పరిధిలోని సోమిదేవరపాలెంకు చెందిన సాధనాల చిట్టిబాబు సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా అతనిని అయినాపురం రోడ్డులో లారీ ఢీ కొంది. ఈ ఘటనలో చిట్టిబాబు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో గాయపడిన అతనిని హుటాహుటిన అంబులెన్సులో అమలాపురంలో ప్రయివేటు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

చెల్లికి విడాకులు ఇచ్చాడని బావపై దాడి

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణంలో క్రిస్టియన్ పేటకు చెందిన కొడమంచిలి ఉదయ్ కుమార్ కొంతకాలంగా భార్యతో దూరంగా ఉంటున్నారు. మంగళవారం ఆయన కుమార్తెను బైకుపై స్కూలులో దింపి తిరిగి వస్తుండగా అతని బావమరిది దొండపాటి సురేష్ కుమార్ ఆపి తగువు పడ్డాడు. నా చెల్లికి ఎందుకు విడాకులు ఇచ్చావని ఉదయ్ కుమార్‌ను కొట్టినట్టు బాధితుడు ఫిర్యాదు చేశాడని హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు.

బైకు చోరీపై కేసు నమోదు

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణంలో క్రిస్టియన్ పేటకు చెందిన పీతల నాగార్జునకు చెందిన బైకు చోరీకి గురైనట్లు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎఎస్‌ఐ జిజి.ప్రకాష్ తెలిపారు. పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం రాత్రి పార్కింగ్ చేసిన బైకు చోరీ గురైనట్లు ఫిర్యాదులు పేర్కొన్నారని అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు

గడ్డి మందు తాగిన యువకుడు మృతి

ప్రజాశక్తి - సీతానగరం

గడ్డి మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటన వంగలపూడిలో చోటు చేసుకుంది. వంగలపూడికి చెందిన చిత్రా సూరిబాబు (24) నెల రోజుల క్రితం బీర్జాలకు సంబంధించి ఆపరేషన్ చేయించుకున్నాడు. అప్పటినుండి మానసిక ఆందోళన చెందుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి యువకుడు మరణించాడు. సీతానగరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సారా రహిత గ్రామంగా నేమాం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

నవోదయం పథకంలో సారా రహిత గ్రామంగా నేమాం గ్రామాన్ని గుర్తించినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.రామ్మోహన్ తెలిపారు. మంగళవారం నేమం గ్రామంలో సర్పంచ్ రామదేవపు సూర్యప్రకాష్‌రావు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్, ఎక్సైజ్ సిబ్బంది, పంచాయతీ అధికారుల సమన్వయంతో నవోదయం పథకంపై విస్తత ప్రచారం చేయడం జరిగిందని చెప్పారు. ఈ నేపథ్యంలో మూడు నెలల నుంచి గ్రామంలో ఒక్క సారా కేసు నమోదు కాలేదన్నారు. దీంతో నేమాం గ్రామాన్ని సారా రహిత గ్రామంగా గుర్తించినట్లు తెలిపారు. ఈ గ్రామ సభలో ఎక్సైజ్ ఎస్‌ఐ బిఎన్ఎస్.వరహాలు, సిబ్బంది పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఆర్ఎఒ మునిస్వామితో మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీనివాస అశోక్

గ్యాస్ లీకైన ప్రాంతాన్ని పరిశీలించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - యానాం

ఈ నెల 21వ తేదీ అర్ధరాత్రి దరియాలతిప్ప ఐలాండ్ నెంబర్ -3 సమీపంలో గోదావరి పాయలో గ్యాస్ పైప్‌లైన్ లీకైన ప్రాంతాన్ని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 20 ఏళ్లుగా ఒఎన్‌జిసి, రిలయన్స్ సంస్థలు యానంలో తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్న యువతకు ఎలాంటి ఉద్యోగ అవకాశాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. గత పాలకులు సంస్థకు సహకరించారే తప్ప యానాం యువతకు ఎలాంటి లబ్ధి చేకూర్చలేదన్నారు. కోట్లు రూపాయలు దోచుకుంటున్న సంస్థలకు కొమ్ము కాస్తున్నారని అన్నారు. ఆ సంస్థల వల్ల యానాం ప్రాంతమంతా ముప్పు ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అందరికీ న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఆర్ఎఒ మునిస్వామి, డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఎస్‌పి చింతా కోదండరామ్, రైతులు తిరుకోటి నాగేశ్వరరావు, కమిడి బాలయోగి, సబ్బతి లోకేష్, సబ్బతి శ్రీనివాసరావు, కొల్లు చిన నూకంబరం, వాకపల్లి వెంకటేశ్వర రావు, తిరుకోటి చంటి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో మల్లాడి భేటీ

ప్రజాశక్తి - యానాం

వినతిపత్రం ఇస్తున్న మల్లాడి, వనమాడి

కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలితో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, కాకినాడ సిటీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించారు. యానాం గోదావరి నుంచి ఐలాండ్ నెంబర్ - 3 మీదుగా వెళ్లిన ఒఎన్‌జిసి పైపులైన్ లీకైన సంఘటన సంబంధించి కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సంఘటనకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు.

మల్లాడికి గ్రామస్తుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేట ఫిషర్‌మెన్‌పేటలోని మున్సిపల్ కల్యాణ మండపంలో పిచ్చి మొక్కలను తొలగించేందుకు చర్యలు తీసుకున్న పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కల్యాణ మండపం దుస్థితిని మల్లాడికి వివరించిన వెంటనే స్పందించి జెసిబితో శుభ్రం చేయించారని గ్రామస్తులు తెలిపారు.

వినాయక మండపాల పరిశీలన

ప్రజాశక్తి - కరప

మండలంలో వినాయక ఉత్సవాలు సందర్భంగా వివిధ గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న గణేష్ మండపాలను మంగళవారం ఎస్‌ఐ టి.సునీత, తహశీల్దార్ టి.దుర్గాప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వినాయక ఉత్సవ కమిటీలకు సూచించారు. ఎస్సై సునీత మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి 139 విగ్రహాల ఏర్పాటుకు దరఖాస్తులందాయని తెలిపారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరక మాత్రమే లవ్డ్ స్పీకర్లు తక్కువ సౌండ్‌తో వినియోగించాలన్నారు. ఎటువంటి అశ్లీల ప్రదర్శన నృత్యాలు, జూద క్రీడలు నిర్వహించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పవన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక మంగయ్యమ్మపేటలోని యుపిహెచ్‌సిలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ దుర్గభవాని మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరి బాధ్యతగా మసులుకోవాలన్నారు. నివారణ మార్గాలు, అపోహలు, చికిత్స విధానాలు వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వి.రాజు, పిహెచ్‌సి వైద్యులు వై.వినయ్‌కుమార్, హెచ్ఒ రమేష్, హెల్త్ అసిస్టెంట్ త్రిమూర్తులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

ప్రజాశక్తి - కరప

మండలంలోని పెనుగుదురు పంచాయతీ పరిధిలో తడి, పొడి చెత్తపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అనుపమ పాల్గొని మాట్లాడారు. ప్రజలందరూ తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. అలాగే ఇఒపిఆర్‌డి సలాది శ్రీనివాసరావు పెద్దాపురప్పాడు గ్రామాన్ని సందర్శించి తడి, పొడి చెత్త విభజన ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పినిశెట్టి వీరభద్రరావు, జి.చిరంజీవిశ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - పెద్దాపురం

నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న తుమ్మల బాబు

స్థానిక డి కన్వెన్షన్ హాల్లో పెద్దాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు పాల్గొని కమిటీ చైర్మన్ నూనె మంగలక్ష్మి, వైస్ చైర్మన్ మాదిరెడ్డి చంద్రశేఖర్, డైరెక్టర్లు చాగంటి వరలక్ష్మి, గోలి దేవి, గురజారపు దుర్గభవాని, గుత్తుల సూర్యావతి, జలదాని సుబ్రహ్మణ్యం, రేలంగి వెంకటరావు, కొమ్మిరెడ్డి వీర సత్యవేణి, సైనం సాల్మన్ రాజు, తలాటం నాగబాబు, త్సలికి దుర్గ, అమలదాసు ఏసుబాబు, గాదంశెట్టి శ్రీనివాస్, యాళ్ల వీరబాబులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రెటరీ పి.శ్రీనివాస్, టిడిపి నాయకులు రాజా సూరిబాబురాజు, ఆర్‌డిఒ శ్రీరమణి, ఎంపిడిఒ శ్రీలలిత, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, తహశీల్దార్ వెంకటలక్ష్మి, టిడిపి నాయకులు పాల్గొన్నారు. తొలుత పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు.

జగన్‌ను కలిసిన గిరిబాబు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

జగన్‌తో ముద్రగడ గిరిబాబు, ఇతరులు

వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డిని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు మంగళవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని ప్రజా క్షేత్రంలో పార్టీకి సేవలు అందించాలని ఆకాంక్షించారని గిరిబాబు స్థానిక మీడియాకు తెలిపారు. తన తండ్రి యోగక్షేమాలపై ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకున్నందుకు వైఎస్.జగన్‌కు కృతజ్ఞతలు తెలిపినట్లు తెలిపారు.

పెట్రోల్ బంక్ వద్ద బాధితుల ధర్నా

ప్రజాశక్తి - తాళ్లరేవు

బంకు వద్ద ధర్నా చేస్తున్న బాధితులు

స్థానిక బైపాస్‌లోని హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద స్థానికులు మంగళవారం ధర్నా చేశారు. గాడిమొగ పంచాయతీ పెద వలసల గ్రామానికి చెందిన రేకాడి శంకర్ మంగళవారం రూ.220కి పెట్రోల్ వేయమన్నాడు. పెట్రోల్ వేసిన తరువాత తన వాహనం మీటర్ సరిగా చూపించకపోవడంతో అనుమానం వచ్చి సక్రమంగా వేశారా? అని ప్రశ్నించాడు. వేశాను, అనుమానం ఉంటే చెక్ చేసుకో అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో సీసా తీసుకుని వాహనంలో పెట్రోల్ బయటకి తీయగా అందులో లీటరు రాలేదు. పెట్రోల్ వేసినప్పటికే అందులో అర లీటరు పెట్రోల్ ఉంటుందని, జరిగిన మోసంపై బాధితుడు బంక్ యాజమాన్యం, సిబ్బందిని నిలదీశారు. విషయం తెలుసుకుని అక్కడి చేరుకున్న పలు గ్రామాల వాహనదారులు గతంలో తాము ఇలా మోస పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. బంక్‌ను సీజ్ చేసి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోరంగి అడిషనల్ ఎస్‌ఐ ఎ. సత్యనారాయణ ఆందోళకారులతో మాట్లాడారు. జరిగిన మోసంపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆందోళనాకారులంతా పోలీస్టేషన్‌కి వెళ్లి బంక్‌లో జరిగిన మోసంపై ఫిర్యాదు చేశారు.

అభిమానులకు ముద్రగడ లేఖ

ప్రజాశక్తి - కిర్లంపూడి

నన్ను అభిమానించే వారందరికీ కృతజ్ఞతలు తెలియచేస్తూ మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మంగళవారం ఒక లేఖను విడుదల చేశారు. వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి తన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నందుకు ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో తన కుటుంబానికి అండగా నిలిచిన వైసిపి నేతలతోపాటు, టిడిపి నేతలు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

ఏలేశ్వరం ఏలేశ్వరం లయన్స్ క్లబ్ అధ్యక్షులు అనుసూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి గొల్లజీరావు, వూర రాజబాబు, కప్పల నాగభూషణం, జ్యోతుల శ్రీనివాస్, గ్రంధి శ్రీనివాస్, తండూరి రాము పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** సర్పవరం జంక్షన్‌లో కోరమండల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మల్లీశ్వరి, కోశాధికారి శ్రీదేవి, సభ్యులు మాధవి, రత్నం, మోహినికుమారి, మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు. **కాకినాడ** ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు మాట్లాడుతూ మట్టితో చేసిన వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, డి.అశ్విని, విద్యార్థులు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** స్థానిక ఆదర్ష్ కళాశాల ఎదుట మట్టి వినాయక ప్రతిమలను కళాశాల డైరెక్టర్ బుర్రా అఖిలేష్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలంలోని పులిమేరులోని శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల విద్యార్థులు తయారుచేసిన మట్టి వినాయక ప్రతిమలను ప్రిన్సిపల్ రాయవరపు సత్య ఆధ్వర్యంలో ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీరమణి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక ప్రతిమలతో పూజించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వి.మౌనిక, పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు, ఎఒ వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

విఒఎల మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

విఒఎల నూతన కార్యవర్గం

మండల విఒఎల నూతన కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమం రైతు సంఘం కార్యదర్శి గుర్రాల అప్పారెడ్డి, సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు కెవివి.సత్య నారాయణ, కె.నాగేశ్వరరావు సమక్షంలో జరిగింది. నూతన కమిటీ అధ్యక్షులుగా ఎస్.నిర్మల, కార్యదర్శిగా పి.సుశీల, కోశాధికారిగా కెడి.ప్రసాద్‌తో పాటు 15 మంది సభ్యులతో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా విఒఎల అకౌంట్లలో జీతాలను నేరుగా వేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సరుకులు తెచ్చే బాధ్యతను విఒఎలకు అప్పగించాలని, కాలపరిమితి సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని, ప్రతి విఒఎకు ఫైవ్ సెల్‌ఫోన్‌ను ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ.5 లక్షలు కల్పించాలని తీర్మానించారు.

చవితి ఉత్సవాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - సామర్లకోట

అవగాహన ర్యాలీలో డిప్యూటీ ఎంపిడిఒ భైరవమూర్తి, ఇతరులు

మండలంలోని హుస్సేన్‌పురం గ్రామంలో చవితి ఉత్సవాల నిర్వహణపై మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో సిఐ ఎ.కృష్ణ భగవాన్ పాల్గొని మాట్లాడారు. వినాయక ప్రతిమలు ప్రతిష్ఠించేవారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వచ్చిన క్యూ ఆర్ కోడ్‌ను పందిరి వద్ద అతికించాలన్నారు. ప్రతి రోజు పోలీసులు ఆ క్యూ ఆర్ కోడ్‌లను తనిఖీ చేస్తారని తెలిపారు. ఉత్సవాల సమయంలో ఎటువంటి అవాంఛ నీయ ఘటనలు జరగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి కొనుగోలు, విక్రయం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సదస్సులో గ్రామ టిడిపి అధ్యక్షుడు చల్లా బుజ్జి, వినాయక చవితి ఉత్సవ కమిటీల సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అలాగే డిప్యూటీ ఎంపిడిఒ మల్లాడి భైరవమూర్తి ఆధ్వర్యంలో కాపవరం గ్రామంలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో హెచ్ఎం ఎ.వెంకన్నబాబు, టీచర్ ఎ.ఆశాలత, గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు యూనిఫామ్ అందజేత

ప్రజాశక్తి - కరప

విద్యార్థులకు యూనిఫాంను అందిస్తున్న డాక్టర్ సత్యస్వరూప్

స్థానిక జడ్‌పి హైస్కూల్లోని ఇంటర్ ప్లస్ టు కు చెందిన 30 విద్యార్థులకు రెండు జతల యూనిఫాంను డాక్టర్ సత్యస్వరూప్ మంగళవారం అందజేశారు. విద్యార్థులకు యూనిఫాం కావాలని పోలిశెట్టి తాతీలుకు ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన డాక్టర్ సత్య స్వరూప్ కలిసి విద్యార్థుల అవసరతను వివరించారు. ఈ నేపథ్యంలోనే డాక్టర్ సత్యస్వరూప్ రూ.48 వేలతో 30 మంది విద్యార్థులకు రెండు జతలు చొప్పున యూనిఫాంను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, సీనియర్ జర్నలిస్ట్ చోడిశెట్టి సత్యనారాయణ, నక్కా శ్రీనుబాబు, నక్కా సత్తిబాబు, పేపకాయల మాచర్రావు, పేకేటి ప్రసాద్, నక్కా ఏసు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా: ముదునూరి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



బాధితునికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ముదునూరి

కష్టంలో ఉన్న కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ మురళీకృష్ణంరాజు అన్నారు. మండలంలోని ఒమ్మంగి గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త గంటా బాబురావుకు ఇటీవల శస్త్ర చికిత్స జరిగింది. విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం బాధితుడిని పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. అదే గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు ముమ్మిడి చక్రరావు ఇటీవల బ్రెయిన్ ఆపరేషన్ చేయించుకున్నారు. ఆ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ కార్యకర్తలకు, నిరుపేదలకు, తనను అభిమానించే వారికి ఏ కష్టం వచ్చినా అండగా నిలబడతానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గంటా గంగబాబు, గంటా బుజ్జి, రామిశెట్టి దొరబాబు, బుర్రె సూరిబాబు పాల్గొన్నారు.

రేషన్ షాపుల వద్ద మహిళల క్యూ

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలో రేషన్ షాప్‌ల వద్ద స్మార్ట్ రేషన్ కార్డుల కోసం మహిళలు బారులు తీరారు. గతంలో అమ్మబడి రేషన్ కార్డుల్లో మహిళల పేర్లతో ఇవ్వగా. ఈ ప్రభుత్వం ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో పాటు స్మార్ట్ రేషన్ కార్డులో కూడా ఇంటి యజమానిగా మహిళలను గుర్తించారు. మహిళల పేరే స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నారు.

CHANGE OF NAME

I, JUJJAVARAPU VENKATA RAYUDU, R/o 3-34/2, Near Siti Cable, Kanuru, Peravali Mandalam, E.G. Dist., A.P., Prevously Called As **JUJJAVARAPU VENKATA RAUYUDU** Has Been Changed My Name As **JUJJAVARAPU VENKATA RAYUDU.** My Name Hereinafter Called As **JUJJAVARAPU VENKATA RAYUDU** In Future Transactions.

- JUJJAVARAPU VENKATA RAYUDU.

IN THE COURT OF THE I ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION), KAKINADA
I.A. No.180/2024 in O.S.No.141/2024

Between:
Chinnam Venkata Reddy ...Petitioner/Plaintiff
and
Chanuboyina Venkateswarlu ...Respondent/Defendant

To: Respondent:
Chanuboyina Venkateswarlu, S/o. Veeraswamy, aged 64 years, Occ.: Business, R/o. D.No.17-2-59/275, Nookalamma Mnayam, Sanjay Nagar, Kakinada City, Kakinada Urban Mandal.

పై నెంబరు పిటిషన్‌లో రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టు ద్వారా మరియు పోస్టల్ ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించినను తీసుకొనక ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు మీ హాజరు నిమిత్తం **02-09-2025** సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై శ్రీ కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియ పర్చుకోవలెను లేనియెడల పై పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
Dr. మేడపాటి ధర్మారెడ్డి
A.U.V.స్వామి
న్యాయవాదులు, ప్రతాప్ నగర్, కాకినాడ
సెల్: 8099505050

IN THE COURT OF THE I ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION), KAKINADA
O.S.No.141/2024

Between:
Chinnam Venkata Reddy ...Plaintiff
and
Chanuboyina Venkateswarlu ...Defendant

To: Defendant:
Chanuboyina Venkateswarlu, S/o. Veeraswamy, aged 64 years, Occ.: Business, R/o. D.No.17-2-59/275, Nookalamma Mnayam, Sanjay Nagar, Kakinada City, Kakinada Urban Mandal.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు ద్వారా మరియు పోస్టల్ ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను తీసుకొనక ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు మీ హాజరు నిమిత్తం **02-09-2025** సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై శ్రీ కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియ పర్చుకోవలెను లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
Dr. మేడపాటి ధర్మారెడ్డి
A.U.V.స్వామి
న్యాయవాదులు, ప్రతాప్ నగర్, కాకినాడ
సెల్: 8099505050

మహారాజశ్రీ 2వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రంగారెడ్డి జిల్లా, హయత్‌నగర్, హైదరాబాద్
O.S. No. 338/2024

Between:
D.B.Kagava ...Plaintiff
AND
Satuluri Ammaiah, S/o. Satyanandam, Hindu, aged 65 years, R/o. D.No. 30-16-5, St. Paul's Luthern Church Compound, Near Geetha Apsara Theatre, Rajamahendravaram, East Godavari District. ...Defendant

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 12-9-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి 26-8-2025 కె.వి.వి.సత్యనారాయణ అడ్వకేట్, రాజమండ్రి

NOTICE

(Substitute service under order V rule 20 CPC as per orders of the Hon'ble Court)
IN THE COURT OF THE IV ADDL. JUNIOR CIVIL JUDGE:KAKINADA
I.A.845/2023 in O.S.1017 of 2023

Between :
Vasireddy Chakradhara Rao@Babji ..Petitioner/Plaintiff
and
1) Medapati Mani Kumari
2) Medapati Sai Kiran Reddy ...Respondents/Defendants

To,
1. Medapati Mani Kumari, W/o. (Late) Ramesh Reddy, Age: 44 years, Occ: House Wife, R/o.Door No.3-16B-102/1, Santhi Nagar, Kakinada, Kakinada Junior Civil Judges Courts Jurisdiction. **(Respondent No.1)**
2. Medapati Sai Kiran Reddy, S/o. (Late) Ramesh Reddy, Age: 24 years, Occ: Private Employee, R/o Door No. 3-16B-102/1, Santhi Nagar, Kakinada, Kakinada Junior Civil Judges Courts Jurisdiction **(Respondent No.2)**

That as per the orders of the Hon'ble Court Notice is hereby Published that both of you shall appear before the Hon'ble Court on **15-09-2025** either in person or through your advocate at **10.30 A.M,** if both of you fail to appear the matter will be heard and decided by the Hon'ble Court as per Law. Hence this substitute service of notice published as per the orders of the Hon'ble Court dated:21-08-2025

BATCHU RAJESH, Advocate
#25-6-37/A, Ganjamvari Street, KAKINADA. Cell: 9848945055

దస్తావేజులు పోయినవి

పిఠాపురం పట్టణమునకు చెందిన మదురబోయిన సాయిబాబా తండ్రి.వీర్రాజు గారికి పిఠాపురం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిస్ట్రేషన్ అయిన దస్తావేజు **నెం.3142/1981** చెందియున్నవి. సదరు దస్తావేజులను **ది.19-07-2025**వ తేదీన జిరాక్స్ నిమిత్తం పిఠాపురంలో మా ఇంటి వద్ద నుండి చర్చి సెంటర్‌లో జిరాక్స్ షాపుకు జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా దారిలో ఎక్కడో పడిపోయినది. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాకు అందజేయగలరు.

మధురబోయిన సాయిబాబా
తండ్రి.వీర్రాజు, డో.నెం.6-3-137/బి, మారెమ్మతల్లి గుడి వీధి, పిఠాపురం-533450
సెల్.9849964101

IN THE COURT OF THE 12TH ADDL.DISTRICT JUDGE-CUM-MACT, PRATHIPADU
M.V.O.P.No.36/2024

Between:-
తాకాసి శివ ...పిటిషనర్
మరియు
దన్నిన శేఖర్ వగైరా ...రెస్పాండెంట్లు

1st Respondent: దన్నిక శేఖర్ S/o వెంకటేశ్వ్రరావు, వయస్సు 43సం॥లు, JCB డ్రైవర్, మట్టపల్లి వారి వీధి, సామర్లకోట.

పై నెంబరు వ్యాజ్యము నందు 1st Respondent కు కోర్టు ద్వారా ఎన్నిమార్లు సమన్లు పంపినను కోర్టు సమన్లు అమలు కాకుండా తప్పించుకొనుచున్నారు. కావున **ది.09-09-2025** తేదీ ఉదయం **10.30ని॥లకు** కోర్టు యెదుట వ్యక్తిగతంగా కాని ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను. అట్లు హాజరు కాని యెడల మీ పరోక్షములో కేసు నిర్ణయింపబడును శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము తెలియపర్చడమైనది.

జి.డి.ప్రసన్న కుమార్
అడ్వకేట్, పిఠాపురం
సెల్.9395389211

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), వారి కోర్టులో
O.S.No. 178/2023

Between :
చిట్టూరి నాగశ్వేత, రిప్రజెంటెడ్ బై జి.పి. హోల్డర్ చిట్టూరి విశ్వనాధస్వామి ...వాది
మరియు
దొమ్మేటి దుర్గారావు ...ప్రతివాది

ప్రతివాది:
దొమ్మేటి దుర్గారావు, S/o. వెంకటేశ్వరరావు, వయస్సు 36 సం॥లు, షాపు నెం.1, డోర్.నెం.69-5-15/ఎ, గైగోలుపాడు, రమణయ్యపేట, కాకినాడ - 533005.

పై నెంబర్ దావాలో మీరు ప్రతివాది అయి ఉన్నారు. సదరు దావాలో శ్రీ కోర్టువారు మీకు ఎన్నిమార్లు సమన్లు పంపినా మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు శ్రీ కోర్టువారి ఆర్డర్ ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియచేయునది. సదరు దావాలో మీరు **ది. 10-09-2025వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టువారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీకు సదరు దావాలో ఏవైనా అభ్యంతరములు ఉన్నచో తెలియచేయవలెను. లేనిచో మీ పరోక్షమున సదరు దావాను శ్రీ కోర్టువారు తీర్మానించుదురని తెలియచేయడమైనది.

ముత్తా వెంకన్న, అడ్వకేట్
కాకినాడ,సెల్: 9063829474

వేలం ప్రకటన

IN THE COURT OF THE IV ADDL. JUNIOR CIVIL JUDGE, KAKINADA
E.P. No.285/2024 in O.S.No.902/2022

Between:
Nallamilli Bhaskara Reddy ...DHr
and
Medisetty Srinivasa Rao ...JDr

పై నెంబరు అమలు గ్రంధములో JDr వద్ద నుండి DHrకు రావలసిన డిక్రీ బాకీకి గాను JDr తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలపు యిస్తీహార్లు షరతులకు లోబడి ది. **10-09-2025** తేదీన ఉదయం గం॥ **10.30** ని॥ లగాయితూ పై శ్రీ కోర్టువారి ఎదుట బహిరంగ వేలం వేయుదురు. పాడదలచినవారు వచ్చి సదరు వేలం పాటనందు పాల్గొని పాడుకోవలెను. వివరముల కొరకు పై శ్రీకోర్టు నజారత్ నందు గాని, DHr అడ్వకేటు గారి ఆఫీసు నందు గాని తెలుసుకొనవలెను.

SCHEDULE: Item No.1: East Godavari District, Samalkota Mandal, Samalkota Sub-Registry, Samalkota Village, Manuguladibba Street, Ward No.2, Assessment No.1066007677, D.No.2-5-37/1, R.C.C. Daba House as two items, an extent of 243½ sq.yds. being bounded by:
East: 58½ feet - Item No.2 and house of Thota Sathi Raju, **West:** 49½ feet - Sandu Way, **South:** 23 feet - Raja Veedhi, **North:** 23½ feet - Wall of Sathi Dhanalakshmi.
Item No.2: 104 sq.yds. site bounded by:
East: 38½ feet - Thota Sathi Raju wall, **West:** 41 feet - Item No.1, **South:** 26½ feet - Wall of Akula Sathi Raju, **North:** 20½ feet - Wall of Gadala Pydamma.
With all easementary rights etc.
DHr Value: Rs.3,00,000/-
Amin Value: Rs.23,00,000/-, JDr Value: Not given

N.S.R.N.చౌదరి, అడ్వకేట్
డో.నెం.10-7-34, ధనుంజయ అపార్ట్‌మెంట్స్, రామారావుపేట, కాకినాడ, సెల్: 9848222565